ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పాలరాజుకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు రేంజ్ డిఐజి పాలరాజు ఉద్యోగోన్నతి పొందారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఏలూరు రేంజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఉద్యోగ రాష్ట్రస్థాయి ప్రమోషన్లలో భాగంగా నలుగురు ఐపిఎస్‌లకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా పాలరాజుకు కూడా ఉద్యోగోన్నత కల్పించింది. ఈ సందర్భంగా ఆయనను ఏలూరు రేంజ్‌లో పనిచేస్తున్న జిల్లా ఎస్‌పిలు, ఏలూరు నగరంలోని పలువురు పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు సర్వంసిద్ధం

భీమవరంలో నేడు భారీ ప్రదర్శన, బహిరంగ సభ

హాజరు కానున్న కేరళ పరిశ్రమల శాఖా మంత్రి రాజీవ్, జాతీయ నేతలు

2, 3, 4 తేదీల్లో కార్మిక, ఉద్యోగుల సమస్యలపై విస్తృత చర్చలు

ప్రతినిధుల సభ ముఖద్వారం

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు 16వ రాష్ట్ర మహాసభకు పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం, రెండో బార్డోలిగా పేరొందిన భీమవరం పట్టణం ముస్తాబైంది. తోరణాలు, జెండాలు, అమరవీరుల ఫ్ల కార్డులు, స్వాగత ద్వారాలతో పట్టణం నలుమూలల కార్మిక సభల వాతావరణం నెలకొంది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో మూడు రోజులపాటు జరగనున్న ఈ మహాసభ సందర్భంగా తొలిరోజు పది గంటలకు పతాకావిష్కరణతో ప్రారంభ సభ జరగనుంది. మధ్యాహ్నం ఒంటి గంటకు పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న కేశవరావు హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ గ్రౌండ్ వరకూ పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతరం రెండు గంటలకు బహిరంగ సభ జరగనుంది. ఈ సభలో కేరళ పరిశ్రమల శాఖా మంత్రి పి.రాజీవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించనున్నారు. అలాగే సిఐటియు జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె.హేమలత, తపన్‌సేన్, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.నర్సింగరావు, ఎంఎ.గఫూర్, రాష్ట్ర నేతలు జి.బేబిరాణి, వి.ఉమామహేశ్వరరావు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఇళ్ల వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ తదితరులు ప్రసంగించనున్నారు. ప్రతినిధుల సభా ప్రాంగణానికి టి.షడ్రక్, సావిత్రమ్మ నగర్‌గా నామకరణం చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి వెయ్యి మంది కార్మిక నాయకులు ప్రతినిధులుగా హాజరుకానున్నారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాలను కలుపుతూ మూడు అమరవీరుల జాతాలు ఆదివారం రాత్రికి తాడేపల్లిగూడెం చేరుకున్నాయి. ఇవి సోమవారం ఉదయం బయల్దేరి మధ్యాహ్నానికి భీమవరం చేరుకుంటాయి. మహాసభ ఏర్పాట్లను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, కార్యనిర్వాహక కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక నృత్యాలు, గేయాలు

సిఐటియు రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రజా నాట్యమండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆట, పాట, మాట కార్యక్రమంలో భాగంగా చేసిన సాంస్కృతిక నృత్యాలు, అభ్యుదయ గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గురజాడ మా అడుగుజాడ, దేశం అంటే మట్టి కాదని, మాకొద్దు నల్ల దొర తనం, కార్మిక కదంబం, చమట చుక్కా వంటి సాంస్కృతిక నృత్యాలు, ఆజాది డాన్స్, ఆవాజ్ దో హమ్ ఏక్ హై డాన్స్‌లు ఆకట్టుకుని ఆలోచింపజేశాయి. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పి.మంగరాజు, ఎస్.అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ వలీ, చైతన్య ప్రసాద్, నాయకులు ఈశ్వర్‌రావు, ఇ.రాజు, సుంకన్న పాల్గొన్నారు.

వాహనాల పార్కింగ్ ఇలా

సిఐటియు భారీ ప్రదర్శన, బహిరంగ సభకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రదర్శన బహిరంగ సభకు విచ్చేసే వారు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు పార్కింగ్‌కు ఏర్పాటు చేసిన చోటే వాహనాలు నిలుపుదల చేయాలని ఆహ్వాన సంఘం కోరింది.

ఆకివీడు, ఉండి మీదుగా వచ్చు వాహనాలు ఉండి బైపాస్ మీదుగా విజయలక్ష్మి థియేటర్ వద్దకు రావాలి. తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలు విజయలక్ష్మి థియేటర్ వద్దకు వచ్చి వాహనాలు అన్నీ డీమార్ట్ వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి పక్కన రైల్వే గేట్ రోడ్డులో టూ, త్రీ వీలర్స్, మినీ బస్ పార్కింగ్ చెయ్యాలి. లారీలు మాత్రం ఉండి బైపాస్‌లో పార్కింగ్ చేయాలి. పాలకొల్లు వైపు నుంచి వచ్చు వాహనాలు డిపో నుంచి బైపాస్ మీదుగా మెంటేవారితోటలో వండర్ కిడ్స్ గ్రౌండ్స్ లో పార్కింగ్ చెయ్యాలి. లారీలు బైపాస్‌లో పార్కింగ్ చేయాలని కోరారు.

కార్మిక, ప్రజలు సమస్యలపైనే ఎజెండాగా చర్చిస్తాం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

సిఐటియు రాష్ట్ర మహాసభకు భీమవరం పట్టణం తోరణాలు, జెండాలు, అమరవీరుల ప్లకార్డులతో, స్వాగత ద్వారాలతో పండుగ వాతావరణం నెలకొనేలా ముస్తాబైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని అల్లూరి శ్రీరామరాజు విజ్ఞాన కేంద్రం వద్ద మహాసభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టి.షడ్రక్, సావిత్రమ్మనగర్‌లో మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి వెయ్యి మంది కార్మిక నాయకులు ప్రతినిధులుగా హాజరవుతున్నారని తెలిపారు. మూడు సంవత్సరాల కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు, కార్మికులకు విశేష సేవలందించిన కార్మిక నాయకులు ఈ మహాసభలకు ప్రతినిధులుగా హాజరవుతున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో కార్మికులను ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోలేకపోయాయన్నారు. కరోనా సమయంలో ఆదుకోకపోగా సమస్యలు సృష్టించిన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించారన్నారు. రాష్ట్రంలో అనేక పోరాటాలు నిర్వహించిన పోరాటయోధులకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సిద్ధంగా ఉందన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రతినిధుల సభ ప్రారంభమవుతుందని, మహాసభల ప్రారంభ ఉపన్యాసం సిఐటియు అఖిల భారత కార్యదర్శి మాజీ ఎంపీ తపన్ సేన్ ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పాత బస్టాండ్ సెంటర్ నుండి కార్మిక కర్షక ప్రదర్శన ర్యాలీ జరుగుతుందని, అనంతరం బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా కేరళ న్యాయ పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గన్నవరం విమానాశ్రయంలో సిఐటియు జాతీయ నేతలకు స్వాగతం

సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత, కార్యదర్శి తపన్ సేన్‌లకు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. భీమవరంలో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు ఢిల్లీ నుంచి విమానంలో వారు ఇక్కడకు వచ్చారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కాట్రగడ్డ స్వరూప రాణి, కృష్ణా జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు, సిఐటియు గన్నవరం మండల నాయకులు బడుగు మరియదాసు, ఐలు నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు స్వాగతం పలికారు.అనంతరం జాతీయ నాయకులు భీమవరం బయల్దేరి వెళ్లారు.

గన్నవరం విమానాశ్రయంలో జాతీయ నేతలకు స్వాగతం

గీతాలు ఆలపిస్తున్న కళాకారులు

పట్టణంలో రెపరెపలాడుతున్న సిఐటియు జెండాలు

పట్టణంలో ఏర్పాటు చేసిన సిఐటియు స్వాగత ద్వారం

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పురపాలక సంఘం పరిధిలో రైతు బజారు సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల బాలికల వసతి గృహం, వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో నూతన సంవత్సర సందర్భంగా విద్యార్థినులతో కలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కేక్‌కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. ఈ సందర్భంగా పుస్తకాలు, పెన్నులను, స్వీట్స్ విద్యార్థినులకు కలెక్టర్ అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. గతంలో చదువుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు ఉండేవని, ఇప్పుడు చదువుకోటానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని అవకాశాలను అందుపుచ్చుకొని బాగా చదువుకోవాలని అన్నారు. వసతి గృహాల్లో ఆహారం, తాగునీరు, శానిటేషన్, వ్యక్తిగత మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను స్వయంగా జిల్లా కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి కె.శోభారాణి, హెచ్‌డబ్ల్యూలు సిహెచ్ భానుమణి, కుసుమ, వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అభివద్ధికి భాగస్వామి కావాలి : జెసి

సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో జిల్లా అభివద్ధికి అంతా భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మురళి అన్నారు. జిల్లా జాయింటు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం నిర్వహించారు. జిల్లా ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ దాసి రాజు, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి జెసి భారీ కేక్‌ను కట్ చేశారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది బొకేలు, పండ్లను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన ఏడాది అనుభవాలు, జ్ఞాపకాలతో కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు నడవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలను మారుమూల పల్లెల్లోని నిరుపేద కుటుంబాలకు అందించి, ప్రభుత్వ కార్యక్రమాలను ఇష్టపడి పనిచేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు.

తాడేపల్లిగూడెం చేరిన సిఐటియు రాష్ట్ర ప్రచార జాత

తాడేపల్లిగూడేనికి రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాతా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహసభను, భారీ ప్రదర్శనను, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇచ్ఛాపురం మందస (వీరగున్నమ్మ స్థూపం) నుంచి డిసెంబర్ 28న బయలుదేరిన రాష్ట్ర కార్మిక చైతన్య యాత్ర జాతా ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణం చేరింది. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ జాతాకు ఘనస్వాగతం పలికారు. ఈ జాతాను ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరశింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబీరాణి మాట్లాడుతూ భీమవరంలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర జీపు ప్రచార జాతా ప్రచారం చేస్తుందన్నారు. భీమవరంలో జరుగుతున్న మహాసభలో ముఠా కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ అమలు చేయాలని తీర్మానం చేస్తామన్నారు. అన్ని రంగాల్లో ఉన్న కాంట్రాక్టు వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు 60 సంవత్సరాలు దాటిన తరువాత ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్ వంటి సదుపాయాలు అమలు జరిగేలా రాష్ట్ర మహాసభలో చర్చించి అమలుకు నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 38 కోట్ల మంది అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఉన్నారని, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సదుపాయాలు కల్పించడం లేదని అన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ వంటివి అమలు కావడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయన్నారు. మోడీ 2014లో అధికారంలోకి రాకముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక వాటిని గాలికి వదిలేశారన్నారు. బ్రిటీషు కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చారన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు, కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. భీమవరం జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ, రెండో తేదీన 30 వేల మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయడం ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వెన్నులో వణుకు పుడుతుందన్నారు. ఈ జీపు ప్రచార జాతా ప్రారంభానికి కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ ఎన్.రమణరావు, జి.నాగేశ్వరరావు, చిటికిన రాము, జవ్వాది శ్రీను, పి.పైడియ్య పాల్గొన్నారు.

హిందూపురం, కుప్పం నుండి బయలుదేరిన జాతాలు ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం చేరాయి. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఓగులు, కె.అజయ్, డి.రమాదేవి, కె.సుబ్బరావమ్మ, ఇతర నేతలు విచ్చేశారు.

న్యాయం చేయకుంటే.. కోర్టును ఆశ్రయిస్తా

ఎంఎంసి మాజీ చైర్మన్ సాంబశివరాజు ఆవేదన

ప్రజాశక్తి - ఉండి

రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు వివక్ష చూపిస్తూ నాన్చడంతో ఒకే సరిహద్దులోని ఇద్దరు రైతుల మధ్య గొడవలకు కారణం అవుతున్నారని ఎంఎంసి మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాంబశివరాజు మాట్లాడుతూ ఉండి గ్రామ పంచాయతీ పరిధిలోని గణపవరం రోడ్డు పులుగుమ్మ సమీపంలో తనకు 18 ఎకరాలు భూమి ఉందని, చుట్టుపక్కల ఉన్న భూములన్నీ చేపల చెరువులు కావడంతో వరిసాగు చేసేందుకు వీలులేనందున వాటిని నాలుగు సంవత్సరాలుగా ఆదాయం లేక పంట పండించకుండా ఖాళీగా ఉంచేశానని ఆవేదన వ్యక్తం చేశాడు. తన పొలాన్ని చేపల చెరువులుగా తవ్వుకునేందుకు గత సంవత్సరం అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోగా అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు అనుమతులు రాకుండా అడ్డుకున్నారన్నారు. నా పొలం ఆక్వా జోన్లో ఉన్నప్పటికీ అనుమతులు రాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. నా పొలానికి ఆనుకుని ఉన్న పక్క రైతు చెరువు తవ్వుకుంటూ నాకు చెప్పకుండా నా గట్టుకు ఆనుకొని గట్టు వేశారని వాపోయారు. అంతేకాకుండా మా సరిహద్దుల్లో ఉన్న జగనన్న కాలనీ స్థలానికి ఆనుకొని చెరువు తవ్వేస్తున్నారని, దీనిపై పలుమార్లు ఉండి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు దారి లేకపోతే నా సొంత స్థలం మూడు సెంట్లకు పైగా దారి ఇచ్చానని, ఆ దారిని అనుకొని గట్టు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. తహశీల్దార్ తనకు సంబంధం లేదని చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని తెలిపారు.

నేటి నుంచి నిరవధిక దీక్ష నేపథ్యంలో

మాజీ మంత్రి జోగయ్య అరెస్ట్, తరలింపు

జోగయ్యతో చర్చిస్తున్న పోలీసు అధికారులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్యను ఆదివారం రాత్రి హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం నరసాపురం డిఎస్‌పి మనోహర్ పర్యవేక్షణలో అంబులెన్స్‌లో ప్రత్యేక పోలీసు బందోబస్తు నడుమ ఆసుపత్రికి తరలించారు. దానికి ముందు ఆయన నివాసం వద్ద దాదాపు 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకినాడ, మచిలీపట్నం ఎఎస్‌పిలు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయంలో ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రాత్రికి మరిన్ని అదనపు పోలీసు బలగాలు పట్టణానికి చేరుకున్నట్లు సమాచారం.

జోగయ్య ఇంటి వద్ద భారీ పోలీసు బందోబస్తు

కాపులకు ఇడబ్ల్యూఎస్‌లో ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిరవధిక నిరాహార దీక్ష తలపెట్టిన నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. ముందుగానే ఇంటి చుట్టూ భారీ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రజలు, కాపు సంక్షేమ సేన కార్యకర్తలు, ఆయన మద్దతుదారులు ఆ ప్రదేశానికి రాకుండా చేయడానికి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

జోగయ్యతో అధికారుల చర్చలు

జోగయ్య నిరవధిక నిరాహార దీక్ష నేపథ్యంలో నరసాపురం డిఎస్‌పి మనోహర్, పాలకొల్లు తహశీల్దార్ మమ్మీ, సిఐ అఖిల్ జామాలు ఆయనతో ఆదివారం రాత్రి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జీ పాల్గొన్నారు. ఇడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని జోగయ్య డిమాండ్ చేశారు.

ప్రాణాలర్పించైనా కాపు రిజర్వేషన్ సాధిస్తా : జోగయ్య

తన ప్రాణాలు పోయిన కాపు రిజర్వేషన్ సాధిస్తానని మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య ప్రకటించారు. ఆదివారం ఆయన గృహంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఇడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని ముఖ్యమంత్రి జగన్‌కు లేఖ రాశానని, అయితే ప్రభుత్వం నుంచి స్పందన లేదని చెప్పారు. దీంతో తాను ముందు ప్రకటించినట్లు ఈనెల 2న ఉదయం 9 గంటల నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నట్లు ప్రకటించారు. తన దీక్షను అడ్డుకున్నా, పోలీస్‌స్టేషన్‌కు తరలించినా, ఆసుపత్రికి తరలించినా దీక్ష కొనసాగిస్తానని హెచ్చరించారు.

పేరుపాలెం బీచ్‌లో సందర్శకుల కిటకిట

సాగరతీరాన.. ఆనందహేల

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు, ప్రత్యేక వాహనాల ద్వారా బీచ్ ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. అనంతరం ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని, సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేశారు.

ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలోనూ 'స్పందన'

ప్రజాశక్తి - ఏలూరు

ఈ ఏడాది నుంచి ప్రతి సోమవారం ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పౌరులకు సంబంధించిన ఆన్‌లైన్ సమస్యలు, ఆర్‌సి, డిఎల్ కార్డులకు సంబంధించిన సమస్యలను అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పరిశీలించి వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లాలోని పౌరులందరూ రవాణా శాఖకు సంబంధించిన సమస్యలను ప్రతి సోమవారం రవాణా శాఖ కార్యాలయంలో సంప్రదించి స్పందన ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు.

మాట్లాడుతున్న పేరిచెర్ల ఫౌండేషన్ సభ్యులు

పేదలకు అండగా పేరిచర్ల ఫౌండేషన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేరిచెర్ల ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక రామారావుపేటలోని బృందావనం వద్ద సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ వైస్ ఛైర్మన్ యెగ్గిన నాగబాబు, రాష్ట్ర నాయక పరిషత్ సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఓసూరి కోనా హనుమాన్, బిజెపి నాయకులు ఐ.బాలకృష్ణ గౌడ్, బిసి నాయకులు పట్నాల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2012లో ఏర్పాటు చేసిన ఈ సంస్థ నిత్యం పేద ప్రజలకు ఎన్నో సేవలందిస్తోందన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు, బియ్యం, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పేరిచర్ల ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు వశిష్ట లీయో క్లబ్ సభ్యులు, వాకర్స్ క్లబ్ సభ్యులు పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

ఆచంటలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆచంట

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఆదివారం ఆచంటలో ఘనంగా జరిగాయి. స్థానిక కాపులపాలెం రామాలయం వద్ద నిర్వాహక వర్గ సంఘం పురజనుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు మానేపల్లి రాంబాబు, వరలక్ష్మి దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష తులసి పత్రి పూజ అభిషేకం నిర్వహించారు. సోమవారం ఉదయం ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్థానికులు ముత్యాల పెద్ద వెంకటేశ్వరరావు, సత్యవతి దంపతులు, చిన్న సత్యనారాయణ, అనంతలక్ష్మి దంపతులతో ఆంజనేయ స్వామికి వెండి కిరీటం, ఉత్సవ విగ్రహాలకు వెండి కిరీటాలు బహూకరించనున్నట్లు దాతలు తెలిపారు.

పాలకొల్లులో ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ ఇంటి వద్ద సందడి లేని వైనం

వేడుకలకు ముగ్గురు నేతలు దూరం

బోసిపోయిన పార్టీ క్యాంపు కార్యాలయాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలోని ముగ్గురు నేతలు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండడంతో వారి కార్యాలయాలు బోసిపోయాయి. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ వైకుంఠ ద్వార దర్శనం నిమిత్తం ఆయన తిరుపతి వెళ్లారు. ఆయన 2 రోజులపాటు పాలకొల్లు ప్రజలకు అందుబాటులో లేరు. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ప్రతి సంవత్సరమూ మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వేడుకలకు దూరంగా ఉన్నారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ కూడా 2 సంవత్సరాలుగా వేడుకలకు దూరంగా ఉంటున్నారు. దీంతో 3 ప్రధాన ప్రజా ప్రతినిధుల క్యాంపు కార్యాలయాలు బోసిపోయాయి.

కొడమంచిలి సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

నూతన సంవత్సరం సందర్భంగా కొడమంచిలి సొసైటీ క్యాలెండర్‌ను ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు చెరుకువాడ నరేష్ పోడూరు మండలం తూర్పుపాలెంలో వైసిపి కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్ర కలిగిన సొసైటీ కొడమంచిలి సొసైటీ అని కొనియాడారు. ఇటువంటి సొసైటీలో ఛైర్మన్ ఒక బిసి సామాజికవర్గానికి చెందిన కాండ్రేగుల సత్యనారాయణను ఛైర్మన్‌గా నియమించడం వైసిపి ఘనత అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్, పోలిశెట్టి వనమరాజు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ చట్టాన్ని పొడిగించాలని వినతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎస్‌సి, ఎస్‌టిల సబ్‌ప్లాన్ చట్టం 2023 మార్చితో ముగియనుండడంతో ఈ చట్టాన్ని పొడిగించాలని కోరుతూ ఆదివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు మంత్రి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. చట్ట ప్రకారం జనాభా ప్రాతిపదికన ఎస్‌సి, ఎస్‌టిలకు కేంద్ర, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో 15.7 శాతం నిధులు కేటాయించి ఖర్చు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బివిఎంఐఐఎఫ్ నాయకులు యూన్స్, శ్రీకృష్ణ, పుష్పరాజు, చంద్రరావు, నాగరాజు, రాజశేఖర్, ఏసురత్నం, వీరరాజు, రమేష్, నానిబాబు పాల్గొన్నారు.

విచిత్ర వేషధారణలతో గ్రామాల్లో తిరుగుతున్న వేషగాళ్లు

గ్రామాల్లో వేషగాళ్ల సందడి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సంక్రాంతి పండుగ దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సందడి చేసేందుకు పగటి వేషగాళ్ల హడావుడీ మొదలైంది. డిసెంబరు, జనవరిలో రాక్షస, శక్తి, కోయ, వాయుదేవుడు, బేతాళుడుతో పాటు పలు వేషధారణతో తిరుగుతూ గ్రామాల్లో పెద్ద మనుషుల వద్ద తమ కథలను పొగుడుతూ వారిచ్చిన దాన్ని తీసుకొని కాలం గడుపుతూ జీవిస్తారు. అయితే ప్రస్తుతం మారిన కాలానికి అనుగుణంగా ఊరు తిరిగినా తమను ఆదరించేవారు కనుమరుగయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ తమ పూర్వీకుల నుంచి చేస్తున్న ఈ పనిని వదలలేక చేస్తున్నామని, వచ్చిన దాంతోనే జీవనోపాధి గడుపుతున్నామని కలిదిండికి చెందిన తలుకు ప్రసాద్ అంటున్నాడు. ప్రతిరోజూ ఏదో ఒక వేషంలో తిరిగినా ఎంతా రావడం లేదని అంటున్నాడు. పూటకు ఒక ఊరు చొప్పున తిరుగుతానని చెబుతున్నాడు. పొలమూరు, పెనుమంట్ర, అత్తిలి, నవుడూరు, ఆలమూరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో పండగ వేళల్లో తిరుగుతానని తెలిపాడు. తమ లాంటి కళాకారులకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహం అందించాలని కోరుతున్నాడు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఘనంగా న్యూఇయర్ వేడుకలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆకాంక్షించారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం కేక్‌కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కుటుంబమూ బాగుండాలన్నారు. రోడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తు తరాలకు సరిపోయేలా మంచినీటి పథకాలను రూపొందిస్తున్నామన్నారు. పారిశుద్ధ్య, దోమల సమస్య నివారణకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో చేపట్టనున్నట్లు తెలిపారు. త్వరలో వన్‌టౌన్‌కు సంబంధించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయడం, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎవరికి ఏ పని ఉన్నా తనను నేరుగా కలవొచ్చని తెలిపారు. ఉప ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు, అసిస్టెంట్ కమిషనర్ సుబ్రహ్మణ్యం, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఎడిఎ మురళీకృష్ణ, ఎల్ ఆర్‌ఎస్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

భీమవరం రూరల్ : ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌కు పార్టీ శ్రేణులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం నుండి కూడా ప్రజలు పెద్ద ఎత్తున భీమవరం నియోజకవర్గం నుండే కాకుండా ఇతర నియోజకవర్గాల నుండి కూడా తరలివచ్చి ఆయనను స్వయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అయితే వేలాదిమంది ప్రజలు ఎంఎల్‌ఎ గ్రంధి క్యాంపు కార్యాలయానికి తరలివచ్చిన నేపథ్యంలో పోలీసులు తగు ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, మిత్రులు, అభిమానులు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఎంఎల్‌ఎ తెలిపారు.

పెనుమంట్ర: తహశీల్దార్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను తహశీల్దార్ దండు వెంకట సత్య సూర్యఅశోక్ వర్మ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.విలియమ్స్, ఆర్‌ఐ వై.అప్పారావు, సిఎస్‌ఆర్‌ఐ పోతురాజు, గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్‌ఎలు, సిబ్బంది. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ బి.పూర్ణబాబ్జీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పోలీస్ స్టేషన్లో ఎస్ఐ బి.సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి), జెడ్‌పిటిసి సభ్యురాలు కర్రి గౌరి సుభాషిణికి మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

కాళ్ల : కేక్ కట్ చేస్తున్న పివిఎల్ నరసింహరాజు

కాళ్ల : రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ సమయంలో కూడా సంక్షేమ పథకాలు ఎటువంటి ఆటంకం లేకుండా అమలు చేసిందని, 2023లో కూడా నిర్విరామంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు కోరారు. ఆదివారం పెదఅమిరం పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుక సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ పార్టీ కార్యాలయం పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులతో నిండిపోయింది. అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా డిసిసిబి డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, కటారి జయలక్ష్మి కేశవ, జెడ్‌పిటిసిలు యండగండి శ్రీను, పద్మిగోళ్ల సోమేశ్వరరావు, బ్యాంక్ డైరెక్టర్లు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, పేరిచర్ల సూర్యనారాయణరాజు, పెన్మెత్స దుర్గా ప్రసాదరాజు, సాగిరాజు హరివర్మ, పార్టీ మండల అధ్యక్షులు గణేష్ రాంబాబు పాల్గొన్నారు.

2023 సంవత్సరంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని కాంగ్రెస్ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు ఆదివారం తెలిపారు. అమలాపురంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపానన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పాలకొల్లు : నియోజకవర్గంలోని పలువురు వైసిపి నేతల గృహాల వద్ద నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, డిసిసిబి మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గుణ్ణం నాగబాబు గృహాల వద్ద అభిమానులు, అధికారులతో కోలాహలంగా మారింది. మాజీ ఎంఎల్‌ఎ బాబ్జి గృహం వద్ద అభిమానుల సందడి నెలకొంది. ఇప్పటికే ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ వేడుకలకు దూరంగా ఉన్నారు.

ఆచంట : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్యకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్‌కు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచులు సుంకర సీతారామ్, కోట సరోజినీ వెంకటేశ్వరరావు, జక్కం శెట్టి చంటి, గణేశుల శేషవాణి, సుబ్బారావు, నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

వీరవాసరం : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వీరవాసరంలో జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ ఇంటి వద్ద, తోలేరుపడమటిపాలెంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని ఇంటి వద్ద, మాజీ మంత్రి పీతల సుజాత ఇంటి వద్ద, మాజీ జెడ్‌పిటిసి పోలిశెట్టి సత్యనారాయణ(దాసు) ఇంటి వద్ద వీరవాసరం, రాయకుదురు సర్పంచులు చికిలే మంగతాయారు, గెడ్డం భారతీభాస్కరావు ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు కోలాహలంగా జరిగాయి. పలువురు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

తాడేపల్లిగూడెం: జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మత పెద్దలు శ్రీనివాస్‌ను ఆశీర్వదించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలకు, జనసేన నాయకులకు, కార్యకర్తలకు, వీర మహిళలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2023 సంవత్సరంలో సరికొత్త ఆశలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని, ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ జనసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

ఉండి : నియోజకవర్గంలోని టిడిపి కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌ఎ రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, వైసిపి కార్యాలయంలో డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎంఎల్‌ఎ పాతపాటి సర్రాజు, జనసేన ఉండి నియోజకవర్గ కన్వీనర్ జుత్తిగ నాగరాజు కార్యాలయాల వద్ద నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధికారులు ప్రతినిధులు నడుమ నూతన సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023లో ప్రజలందరూ ఆయురారోగ్య భోగభాగ్యాలతో సుఖ సంతోషాలతో సుఖంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : నూతన సంవత్సర వేడుకల్లో తహశీల్దార్ దండు వెంకట సత్యసూర్య అశోక్ వర్మ

సిఐటియు మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

భీమవరంలో ఈ నెల 2, 3, 4వ తేదీల్లో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ఉపాధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు, కేతా నాగాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ మహాసభకు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు అభిమానులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కుమ్మక్కై పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు, పారిశ్రామిక వేత్తలకు అనుగుణంగా సవరణలు చేశాయని తెలిపారు. వాటి ఫలితంగా 44 కార్మిక చట్టాలను నాలుగు సివిల్ కోడ్లుగా మార్చి కార్మిక చట్టాలకు తూట్లు పొడిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికవర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కోల్పోతున్నారని వాపోయారు. కార్పొరేట్లు ప్రభుత్వ విధానాలను శాసిస్తుండడంతో కార్మిక వర్గానికి, ఉద్యోగులకు మరిన్ని కష్టాలు పెరుగుతున్నాయని తెలిపారు. కార్మిక వర్గానికి హాని చేస్తున్న ప్రభుత్వాలు రాజకీయ శక్తులపై కార్మిక, కర్షకులంతా ఐక్యంగా సమరశీల పోరాటాలను ఏ విధంగా చేయాలో తెలియజేసే కర్తవ్యాలను ఈ మహాసభలో రూపొందించనున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 800 మంది ప్రతినిధులు మహాసభకు హాజరుకానున్నారని, 2వ తేదీన భీమవరం పట్టణంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తణుకురూరల్ : సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా భీమవరంలో జరిగే బహిరంగ సభను ఉద్యోగులు, కార్మికులు విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.దక్షిణామూర్తి, కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక కొమ్మాయిచెరువు గట్టు వద్ద తణుకు తాలూకా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణ సంక్షేమ బోర్డును నాశనం చేస్తోందని విమర్శించారు. బోర్డు ద్వారా గతంలో ఇస్తున్న అన్ని సంక్షేమ పథకాలూ కార్మికులకు అమలు చేయాలన్నారు. ఈనెల 2, 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం ఉద్యమిస్తామని తెలిపారు. మోడీ తీసుకొచ్చిన లేబర్ కోడ్ల వల్ల బోర్డు నిర్వీర్యం చేయడానికి కుట్ర జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి గుబ్బల గోపి, యూనియన్ అధ్యక్షులు అన్నెం సూర్యనారాయణ, కార్యదర్శి కొల్లి శ్రీనివాస్, బొర్రా రామచంద్రరావు, రఫీ పాల్గొన్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర పూరితంగానే కార్మిక హక్కులపై దాడి చేస్తోందని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు విమర్శించారు. యూనియన్ సమావేశం వేల్పూరులోని పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో యర్రా మల్లికార్జునరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ నిరంతరం ఉద్యోగ, కార్మిక ప్రజాశ్రేయస్సు కోసం పోరాడే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ భీమవరంలో మొదటి సారిగా జరుగుతున్నాయన్నారు. 2వ తేదీన జరిగే మహా ప్రదర్శన, బహిరంగ సభలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చోరపల్లి రామకృష్ణ, వీరవల్లి వెంకన్న, దున్నె నాగేశ్వరరావు, మల్లాడి కృష్ణ, వాటాల నాగేశ్వరరావు, పిల్లి పరమేశ్వరరావు, గుడిమెట్ల రాధాకృష్ణ, యాతం పెద్దిరాజు, ఆనందం గంగాధరరావు, గుత్తుల గణేష్ పాల్గొన్నారు.

హామీల అమలే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి- తణుకు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛనుదారులకు ప్రతి నెలా ఒకటో తేదీన పింఛను అందజేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. పట్టణంలో 29వ వార్డులో ఆదివారం తెల్లవారుజామున మంత్రి కారుమూరి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఈ నెల నుంచి పెరిగిన పెన్షన్ రూ.2750లతోపాటు స్వీట్ బాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పరిపాలనలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కొత్త సంవత్సరంలో హాయిగా జీవించాలని విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఉద్యోగాలు సంపాదించుకోవాలని అభిలాషించారు. మంత్రితోపాటు సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు లో భాగంగా కేక్ కట్ చేసి ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆచంట : ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన మాట ప్రకారం పింఛను రూ.2,750లకు పెంచి మరోసారి పింఛనుదారుల కళ్లల్లో ఆనందం నింపారని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలిలో పలు చోట్ల పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇంటికి వెళ్లి తలుపు తట్టి పింఛన్ అందిస్తుంటే వృద్ధులు ఎంతో ఆనందపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు గున్నాబత్తుల వెంకటాచారి, కొండేటి రమేష్, పోలిశెట్టి వనమరాజు, సాక సురేష్, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో పింఛన్ల పంపిణీ

తణుకు : వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

వీరవాసరం: చెప్పింది తూచా తప్పకుండా అమలు చేస్తున్న ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు అన్నారు. మండల వ్యాప్తంగా కొత్త పెన్షన్లను ఆదివారం ఆయా గ్రామాల్లో సర్పంచుల చేతుల మీదుగా అందజేశారు. మండలంలో వివిధ కేటగిరిల కింద మొత్తం 8,414 మందికి పెన్షన్లు అందజేస్తుండగా, వాటికి తోడు మరో 298 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయి. 132 పెన్షన్ దారులకు నోటీసులు ఇవ్వగా అందులో 9 పెన్షన్లు తొలగించడం జరిగిందని ఎంపిడిఒ ఉమా మహేశ్వరరావు తెలిపారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో 257 మందికి కొత్త పెన్షన్లు మంజూరయ్యాయని ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్ కుమార్ ఆదివారం తెలిపారు. గతం నుంచి పింఛను తీసుకున్న వారికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మరో 250 రూపాయలు పెంచి రూ.2750 అందించామని తెలిపారు. వివిధ కారణాలతో అనర్హులుగా గుర్తించిన 98 మందికి నోటీసులు ఇచ్చామన్నారు. వారందరూ సరైన సమాచారం అందిస్తే పింఛన్ల కొనసాగుతాయన్నారు. ఈ నెల ఎవరికీ పింఛన్లు ఆపలేదని లబ్ధిదారులందరికీ అందించామని తెలిపారు. కొత్త పింఛన్లతో కలిపి 10,615 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందన్నారు.

ఆచంట : వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న సుంకర సీతారాం

పోసిబాబుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న గోపాలకృష్ణ, సూర్య భాస్కరరావు

బిసి యువజన మహాసభ నియోజకవర్గ కన్వీనర్‌గా పోసిబాబు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బిసి యువజన మహాసభ ఆచంట నియోజకవర్గ కన్వీనర్‌గా మార్టేరుకు చెందిన జొన్నకొట్టి పోసిబాబు నియమించారు. మార్టేరు మావుళ్లమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి జాతీయ బిసి మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన పెనుగొండ ఎఎంసి మాజీ ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, జాతీయ బిసి మహాసభ పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ అల్లాడ సూర్య భాస్కర్‌రావు పోసిబాబుకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలను, రుణాలను అర్హులకు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్స్ మండల అధ్యక్షులు అల్లాడ కుమారస్వామి, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, పిచ్చుక మహేష్, వట్టం లక్ష్మణ్, కోసూరి నాగేశ్వరరావు, అంగర సత్యనారాయణ, రూబీ, భాస్కరరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మవారి ఆలయం యాత్రికులతో కిటకిటలాడింది. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం యాత్రికులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కాలక్షేపం ఏర్పాటు చేశారు.

ముగ్గురు కోడిపందేల రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

కోడిపందేలు ఆడుతున్న చింతపర్రు గ్రామానికి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. వారి వద్ద నుంచి ఒక కోడిపుంజు, 5000 రూపాయల నగదు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - పోడూరు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలని సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూర్పుపాలెంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం బొక్కా పుల్లారావు అధ్యక్ష తన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు 50 లక్షల మంది, జిల్లాలో 2 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వారికి చట్టబద్ధమైన సంక్షేమ బోర్డులున్నా వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన రూ.1200 కోట్లను తిరిగి జమ చేయాలన్నారు. సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఇసుక సరుకుగా మార్చడం వల్ల కార్మికులకు పనుల్లేక వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న చట్టాలను 4 కోడ్లుగా మార్చి కార్మికులను బానిసలుగా చేయాలని చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి బొక్కా పూర్ణచంద్రరావు అధ్యక్షత వహించారు. బండి సుబ్రహ్మణ్యం, కాకర చందు, బొక్కా శ్రీను, కడలి ఏసు, గుబ్బల శ్రీను, సదమళ్ల భీమరాజు, సదమళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన ఏలూరు జిల్లా, మండవల్లి మండలం, మండవల్లి గ్రామ కాపురస్తులు వీరమల్లు శ్యాం ప్రసాద్ గారి కుమారుడు వీరమల్లు శ్రీ వెంకట దుర్గా మల్లేశ్వరరావు అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి ఇందు మూలంగా తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు మండవల్లి మండలం, మండవల్లి గ్రామం, ఆర్.ఎస్.నెం.373/5రులో చ.గ.194 స్థలమును అవ్వారు వుయ్యూరు గారి వారసుల నుండి కొనుగోలు చేసి మండవల్లి సబ్‌రజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం.662/2022రుగా రిజిష్ట్రీ పొందియున్నారు. వారు శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు లోను పొందుటకై దరఖాస్తు చేసియున్నారు. సదరు ఆస్తిపై అవ్వారు ఉయ్యూరు గారి వారసుల విషయమై గానీ మరియు ఈ క్రయ దస్తావేజు విషయమై గానీ ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులోగా నాకు గానీ, నా క్లయింటునకు గానీ తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. అట్లు కానిచో తదుపరి వచ్చిన క్లెయిమ్స్ ఏమియూ నా క్లయింటును బైండ్ ఓవర్ చేయజాలవని యావన్మందికి తెలియజేయడమైనది.

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ & నోటరీ, ఏలూరు.
ఏలూరు
తేది.31.12.2022
సెల్: 9440111033